క్లుప్తంగా

సీఐ చొరవతో విద్యార్థినికి సర్టిఫికెట్ల జారీ



విద్యార్థినికి ఆర్థికసాయం అందిస్తున్న సీఐ

ధర్మవరం అర్బన్: సీఐ చొరవతో డిగ్రీ విద్యార్థినికి సర్టిఫికెట్లు జారీ అయ్యాయి. పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో భార్గవి 2019–2022 మధ్యలో బీఏ కోర్సు పూర్తి చేసింది. ఫీజురీయింబర్స్‌మెంట్ కింద పడిన డబ్బు కళాశాలకు చెల్లించలేదు. రెండు సంవత్సరాల తర్వాత విద్యార్థిని కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్లు అడగడంతో బకాయి చెల్లించాలని యాజమాన్యం చెప్పింది. తాను చెల్లించే పరిస్థితిలో లేనని సదరు విద్యార్థిని మంగళవారం వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్‌కు ఫిర్యాదు చేసింది. వెంటనే ఆయన ప్రిన్సిపాల్ ముసల్‌రెడ్డిని స్టేషన్‌కు పిలిపించి మందలించారు. విద్యార్థిని ఫీజును సీఐ చెల్లించి, సర్టిఫికెట్లు ఇప్పించేలా చర్యలు తీసుకున్నారు.

ఇంకుడుగుంత తవ్వుకోండి

తాడిమర్రి: ఇళ్లలోని మురుగునీరు వీధుల్లోకి పోకుండా సోక్‌పిట్లు తవ్వుకోవాలని తాడిమర్రి గ్రామ కార్యదర్శి రిజ్వానాబేగం సూచించారు. కునుకుంట్ల రోడ్డులో కొంతకాలంగా మురుగునీరు రోడ్లపైకి వదులుతుండడంతో మంగళవారం ఎస్సీ కాలనీలోని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ వీధుల్లో పోస్తున్న మురుగునీరు రోడ్డుపైకి చేరుతోందన్నారు. మురుగు దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత్రలు, దుస్తులు శుభ్రం చేసిన నీటితో పాటు వర్షపునీరు వీధుల్లోకి రాకుండా ఇంటి పరిసరాల్లోనే ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం రూ.5,500 అందిస్తుందన్నారు.

శ్రీవారి క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2025 నూతన సంవత్సర క్యాలెండ్‌ను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నియోజవర్గ ప్రజలకు ఆయన న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు పార్థసారధి, నరసింహచార్యులు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మాల్యవంతం గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి పర్యవేక్షణలో వీఎస్‌ఏ లావణ్య కంది పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. వారం తరువాత పంటలో దిగుబడి అంచనా వేస్తామని తెలిపారు. అంత వరకు పంటను ఆరబెట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీమా కంపెనీ అధికారి మంజునాథ్, శ్రీనివాస్, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పారితోషికం అందజేత



నగదు పురస్కారం అందజేస్తున్న బ్యాంకు అధికారులు

పుట్టపర్తి అర్బన్: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సహకారంతో విద్యోన్నతి పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు ప్రతిభా పారితోషికం అందజేశారు. పుట్టపర్తి మండలం పెడపల్లి ఏపీజీబీ మేనేజర్ సుభాషిణి, అసిస్టెంట్ మేనేజర్లు రమణకుమార్, సాయికృష్ణ స్థానిక ఉన్నత పాఠశాలలోని 7, 8, 9 తరగతుల్లోని అర్చన, లాస్య, చైత్రలకు రూ.5 వేల చొప్పున పారితోషికం అందజేశారు. హెచ్ఎం రమామణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోగస్ పింఛన్లు ఏరేస్తాం

గాండ్లపెంట/ బత్తలపల్లి/ ఎన్పీకుంట : బోగస్ పింఛన్లను ఏరివేస్తామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. మంగళవారం గాండ్లపెంటలో ఆయన సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తామని, అదే సమయంలో బోగస్ పింఛన్లను ఏరి వేస్తామని చెప్పారు.

- బత్తలపల్లి మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి పింఛన్లు పంపిణీ చేశారు. తొలిరోజు సాయంత్రం 4గంటల వరకు 5,997 మందికి పింఛన్లు అందజేశారు.
- ఎన్పీకుంట మండలంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ తొలిరోజు 95 శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ ఆంజినప్ప తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. హరియాన్ చెరువులో ఎమ్మెల్యే పరిటాల సునీత లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

అంబరం.. నూతన సంబరం

కదిరిటౌన్/ బత్తలపల్లి/ తలుపుల: నూతన సంవత్సర సంబరం అంబరమంటింది. కదిరి, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం నుంచి యువత సందడి కనిపించింది. ఈ సందర్భంగా బేకరీలు, హోటళ్ల నిర్వాహకులు కేకులు, బిరియానీలు ఆఫర్లతో ముంచెత్తారు. దీంతో యువకులు విందులు, వినోదాలతో సంతోషంగా గడిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయానికి రోడ్లపైకి చేరుకుని 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేకలు వేస్తూ హల్‌చల్ చేశారు. టపాసులు పేల్చి.. కేకులు కట్ చేసి సంబరం చేసుకున్నారు. పట్టణ, మండల కేంద్రాలతో పాటు పలు పల్లెల్లో బైబై 2024.. వెల్‌కమ్ 2025 అంటూ నినాదాలు చేశారు. మరోవైపు ప్రతి ఇంటా 'నూతన' శోభ సంతరించుకుంది. ముంగిళ్లు పేడ అలికి.. రంగవల్లులతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. చాలా ఇళ్లల్లో పిల్లలు, యువకులు కేకులు కట్ చేసి సంతోషంగా గడిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు తదితర కార్యాలయాల్లోనూ న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



తలుపులలో కేకుల కొనుగోళ్లు





బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇంటి ముందు వేసిన ముగ్గులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక చేసినట్లు ఇన్‌చార్జ్ హెచ్ఎం రఫిక్, హిందీ పండిట్ వేణుగోపాలాచార్య తెలిపారు. ధర్మవరం పట్టణం, మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి 41 వైజ్ఞానిక నమూనాలు ప్రదర్శించారు. వాటిలో అత్యుత్తమ వైజ్ఞానిక ప్రదర్శనలను వ్యక్తిగత ప్రాజెక్ట్ నుంచి ఒకటి, గ్రూప్ ప్రాజెక్ట్ నుంచి ఒకటి, టీచర్ ప్రాజెక్ట్ నుంచి ఒకటి చొప్పున జ్యూరీ మెంబర్స్ ఎంపిక చేసి జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందించారు. వ్యక్తిగత సైన్స్ ప్రాజెక్టులో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రణీత్, గ్రూప్ ప్రాజెక్టులో కేజీబీవీ పాఠశాల విద్యార్థినులు యాస్మిన్, పూజామయి, టీచర్ ప్రాజెక్టులో దర్శినమల జెడ్పీహెచ్ఎస్ నుంచి రాజేంద్రప్రసాద్‌లు ఎంపికయ్యారు. త్వరలో జరిగే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వీరి ప్రతిభను చూపనున్నట్లు ఉపాధ్యాయులు ప్రసాద్, రంగయ్య, రామకృష్ణ, హరికృష్ణ, నాగేంద్ర, లీలావతి, నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు.

పుట్టపర్తి అర్బన్: బీడుపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఎంఈఓ ప్రసాద్, హెచ్ఎం వెంకటరమణ ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల నమూనాలు ఆకట్టుకున్నాయి.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



ఆర్థికసాయం అందజేస్తున్న రవికుమార్‌రెడ్డి

నల్లచెరువు: మండల కేంద్రంలోని నల్లగుట్ట వీధికి చెందిన సూర్యనారాయణ (45) బ్రెయిన్ స్ట్రోక్‌తో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నల్లచెరువు మాజీ సర్పంచ్ రవికుమార్‌రెడ్డి మృతుని నివాసం వద్దకెళ్లి సూర్యనారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, గోవిందు, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి



దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



మక్బూల్ అహ్మద్

పుట్టపర్తి టౌన్/ ధర్మవరం/ కదిరి టౌన్: నూతన సంవత్సరం – 2025లో ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలని పుట్టపర్తి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆకాంక్షించారు. మంగళవారం వారు వేర్వేరు ప్రకటనల్లో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో కళకళలాడాలని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో అంతా మంచి జరగాలని కోరారు. న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

పుట్టపర్తి అర్బన్: ప్రధాన రోడ్లపై ఎక్కడైనా ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుట్టపర్తి రూరల్ ఎస్ఐ లింగన్న హెచ్చరించారు. మండలంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న కంబాలపర్తి, చెర్లోపల్లి, వెంగమ్మచెరువు గ్రామాల ప్రధాన రోడ్లపై ధాన్యం ఆరబోసిన రైతులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ వరి ధాన్యంపై ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారన్నారు. రోడ్లపై కాకుండా పొలాల్లో ఆరబోసుకోవాలని సూచించారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు

బత్తలపల్లి: మెరుగైన సేవలందించినపుడే ఉద్యోగులకు తగిన గుర్తింపు లభిస్తుందని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, ఏడీఈ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎల్ఎం కప్పల నారాయణస్వామి ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఏఈ శివయ్యతో పాటు ఏడీఈ నరసింహారెడ్డి, 1104 యూనియన్ నాయకులు జీటీ శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, అక్రమ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాన్స్‌కోలో విధులు అంటే కత్తి మీద సాములాంటిదన్నారు. నారాయణస్వామి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాల్యవంతం మాజీ సర్పంచ్ కప్పల హేమలత, పలువురు గ్రామ పెద్దలు, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి అందరూ సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బత్తలపల్లి: మండల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ఎంపీపీ బగ్గిరి త్రివేణి కోరారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారంలోకి ఎవరు వచ్చినా ప్రజలకు మంచి చేయాలనే తపనే ఉంటుందని, అందులో భాగంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి మండలాన్ని అభివృద్ధి పరచడానికి ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు తీసుకువెళ్లాలన్నారు. దంపెట్ల సర్పంచ్ చల్లా కరుణాకర్ నాయుడు మాట్లాడుతూ గత సర్వసభ్య సమావేశాలలో అడిగిన ప్రశ్నలకు ఇంతవరకూ సమాధానాలు లేవని నిలదీశారు. మహిళా సంఘాల సమావేశాలను పార్టీ నాయకుల ఇళ్లల్లో కాకుండా ప్రభుత్వ భవనంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యానిమేటర్లు సంఘాల గురించి చూడాలని, వారి భర్తల ప్రమేయం ఇందులో ఉండరాదని సూచించారు. సమావేశాలకు తరచూ గైర్హాజరవుతున్న రెవెన్యూ తదితర అధికారులపై చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు నివేదిక పంపాలని ఎంపీడీఓ నరసింహనాయుడును కోరారు. అనంతరం పంటల బీమాపై సుదీర్ఘంగా చర్చించారు. పంటల బీమా ఒక స్కామ్‌లా ఉందని సర్పంచ్ అభివర్ణించారు. సమావేశంలో శాశ్విత ఆహ్వానితుడు గుర్రం శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ సాకే పార్వతి, ఏఓ శ్రీనివాసులు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి, ఏపీఓ ఆదెప్ప, హౌసింగ్ ఏఈ కాశీవిశ్వనాథ్, ఏఓ ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, ఎంఈఓ చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, ట్రాన్స్‌కో ఏఈ శివయ్య, పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో పాటు సర్పంచులు సానే జయచంద్రారెడ్డి, అక్కిం కాశమ్మ, బండి సరస్వతి, మొర్రెడ్డిగారి శారదమ్మ, ప్రభాకరరెడ్డి, బత్తినన్న, పద్మావతి, కోఆప్షన్ మెంబర్ కరీంసాబ్, ఎంపీటీసీ సభ్యులు బండి రాములమ్మ, రామాంజనేయులు, సుజాత, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఐపై చర్యలు తీసుకోండి

ధర్మవరం అర్బన్ : అనంతపురంలో న్యాయవాది శేషాద్రి మృతికి కారణమైన త్రీటౌన్ సీఐ, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ధర్మవరం న్యాయవాదులు డిమాండ్ చేశారు. పట్టణంలోని డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగేంద్రప్రసాద్‌లకు మంగళవారం వినతిపత్రం అందించారు. సివిల్ పంచాయితీలు స్టేషన్‌లో చేయకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నా అనంతపురం త్రీటౌన్ సీఐ పంచాయితీ చేసి సీనియర్ న్యాయవాది మృతికి కారణమయ్యారని ఆరోపించారు.

మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించండి

ధర్మవరం: విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు రమణ కోరారు. పట్టణంలోని ట్రాన్స్‌కో ఏడీ కార్యాలయంలో మంగళవారం ఏడీ, ఏఈలకు వినతిపత్రాలు అందించారు. ఒకటే డిస్కంలో రెండు పనులు చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. సబ్‌స్టేషన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ మీటర్ రీడింగ్ తీస్తున్న ముగ్గురు వ్యక్తులను మీటర్ రీడింగ్ నుంచి తీసేయాలని తెలిపారు. వారిని తీసివేయకపోతే జనవరి ఐదో తేదీన మీటర్ రీడర్స్ అందరూ సమ్మెకు సిద్ధం అవుతామన్నారు. మీటర్ రీడర్స్ పనిదినాలను పెంచాలని కోరారు. రీచార్జ్ మీటర్స్ వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మీటర్ రీడర్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్, నాయకులు దస్తగిరి, రామంజనేయులు, బాబావలి, జగదీష్‌కుమార్, బాలశివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ లీగ్ మ్యాచ్‌లో విద్యార్థినుల ప్రతిభ

ధర్మవరం అర్బన్: ఆర్డీటీ లీగ్ మ్యాచ్‌లో ధర్మవరంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చూపి రన్నర్స్‌గా నిలిచారని హెచ్ఎం మేరీ వరకుమారి తెలిపారు. మంగళవారం క్రీడాకారిణులను అభినందించారు. హెచ్ఎం మాట్లాడుతూ క్రికెట్‌లో హస్మిత, నందిని, సుకన్య, హేమలత, పల్లవి, ప్రణీత, నవ్య, సహస్ర, గాయిని, సురేఖ, ప్రత్యూష, లహరి ప్రతిభ చూపారని తెలిపారు. కబడ్డీ పోటీల్లో నవ్య, హస్మిత, జోష్న, హిమబిందు, చంద్రిక, సాయిజ్యోతి, భువనసాయి, బృంద, మానస రన్నర్స్‌గా నిలిచారన్నారు.

ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన



చెన్నేకొత్తపల్లి విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్

చెన్నేకొత్తపల్లి: విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. మండల పరిధిలోని నాగసముద్రం, కనుముక్కల, మేడాపురం, వెల్దుర్తి, వెంకటాంపల్లి, చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలు పాల్గొన్నాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సబ్జెక్టుల వారీగా ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈఓ-2 ప్రసూన్ కుమార్ నాయుడు, పలువురు హెచ్ఎంలు వీటిని పరిశీలించి మండల స్థాయిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశారు. వెల్దుర్తి, కనుముక్కల చెన్నేకొత్తపల్లి ఉన్నత పాఠశాలలు జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

పౌర హక్కులు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా

నల్లచెరువు: రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రఘునాథ గుప్తా సూచించారు. ఉప్పార్లపల్లిలో మంగళవారం సివిల్ రైట్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంబేడ్కర్ కాలనీ వాసులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కాలనీలో డ్రెయినేజీ, మరుగుదొడ్ల సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరగా.. ఎంపీడీఓ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి, వీఆర్వో శ్రీనివాసులు కానిస్టేబుల్ రమణ, వీఆర్ఏలు పతి, శ్రీనివాసులు వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం 2025 సంవత్సరానికి సంబంధించిన పీఆర్‌టీయూ నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యాలయంలో ఎంపీడీఓ శివశంకరప్ప, ఈఓఆర్డీ అశోక్‌కుమార్ నాయక్, పీఆర్‌టీయూ స్టేట్ కౌన్సిల్ మెంబర్ వన్నూరామిరెడ్డి, మండల అధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీ భూషణ, మహిళా కార్యదర్శి శకుంతలమ్మ, సభ్యులు నారాయణ స్వామి, సోమేశ్వర్, బాలకృష్ణారెడ్డి, గాయిత్రి, సరస్వతి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తిపై ఇటుకలతో దాడి

కదిరి టౌన్: వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడనే నెపంతో మారుతీ నగర్‌లో నివాసముంటున్న షేక్ ముస్తఫాపై అదే వీధికి చెందిన మహిళ బంధువులు నదీమ్, నవాజ్ షకీర్, అల్లాబకాష్ తదితరులు మంగళవారం ఇటుకలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

ఎన్పీకుంట: భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ దేవేంద్ర నాయక్ తెలిపారు. ముదుపులజీవి గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి ఆరు అర్జీలు వచ్చాయని ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు. ఫ్రీ సర్వీసెస్ కింద 8 మందికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తక్షణమే మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ జిలానీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా దేవర రామ్మోహన్

తాడిమర్రి: బీజేపీ తాడిమర్రి మండల నూతన అధ్యక్షునిగా దేవర రామ్మోహన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. స్థానిక వీరభద్రయ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం పార్టీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించి మండల అధ్యక్షున్ని ఎంపిక చేశారు. ధర్మవరం బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

92 శాతం పింఛన్ల పంపిణీ

కనగానపల్లి: మండలంలో తొలిరోజు 92 శాతం సామాజిక పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, అధికారులు సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల వ్యాప్తంగా సుమారు 6,400 పింఛన్లు ఉండగా అందులో తొలిరోజు 5,800 మంది లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది పింఛన్ సొమ్ము అందజేశారు.

ఆరోగ్యంపై అవగాహన పెంచుకోండి

పుట్టపర్తి అర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ గణేష్, అసోసియేట్ ప్రొఫెసర్ సంధ్య సూచించారు. మంగళవారం జగరాజుపల్లిలో ఎస్పీవీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఏరువాక శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

చదువుతోనే ఉజ్వల భవిత

ధర్మవరం రూరల్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ధర్మవరం రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం మోటుమర్ల వద్దనున్న కేజీబీవీలో విద్యార్థినులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువును కష్టపడి కాకుండా బాగా ఇష్టపడి చదవాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు.

నూతన క్యాలెండర్ల ఆవిష్కరణ

బత్తలపల్లి: మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం నూతన క్యాలెండర్లను సీపీఐ నాయకులు, మండల అధికారులు ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన కార్యాక్రమంలో ముఖ్య అతిథులుగా మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డి, ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి హాజరయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కుళ్లాయప్ప, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, ఏఐటీయూసీ నాయకులు ఎర్రంశెట్టి రమణ, మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు వడ్డే సన్నపెద్దన్న, కార్యదర్శి బత్తల నాగభూషణ, తాడిమర్రి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ, దాసు, చౌడప్ప, ఓబులేసు, వసూరప్ప, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సోమావతి అమావాస్య పూజలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో రెండురోజుల పాటు సోమావతి అమావాస్య పూజలు చేశారు. మంగళవారం పూజారి ధనుంజయ ఆచారి దోష నివారణ పూజలు చేయడంతోపాటు కూష్మాండ దీపోత్సవం నిర్వహించారు. కాలభైరవస్వామికి భక్తులతో అభిషేకాలు, గుమ్మడికాయలతో పూజలు చేయించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

నల్లమాడ: రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన కనుముక్కల లక్ష్మన్నకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడి సేవలను కొనియాడారు. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ఎన్పీకుంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 66 మంది పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను దాతలు రాధారాణమ్మ, ప్రసాద్ మంగళవారం పంపిణీ చేశారు.

వివాహిత అదృశ్యం

కదిరి టౌన్: నల్లచెరువు మండలం అల్లుగుండు గ్రామానికి చెందిన షేక్ నజీమా అనే వివాహిత అదృశ్యమైంది. మంగళవారం అడపాలవీధిలోని పుట్టింటి నుంచి రెండేళ్ల కుమారుడితో కలిసి బట్టలు తెచ్చుకునేందుకని మెట్టినిల్లు అయిన అల్లుగుండుకు బయల్దేరి తిరిగి రాలేదు. తల్లి షేక్ షబానా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాధ్యతలు గుర్తెరగాలి

నల్లమాడ: మనిషి తన హక్కులతో పాటు సామాజిక బాధ్యతలను గుర్తెరిగి మసలుకోవాలని వక్తలు సూచించారు. కొండకింద తండాలో తహసీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మంగళవారం తండావాసులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, ఎస్ఐ దాదాపీర్, న్యాయవాది వీరనారాయణ, సభ్యులు ఆరుద్ర శ్రీనివాస్ తదితరులు హాజరై పౌర హక్కుల గురించి వివరించారు. గ్రామస్తులు ఐకమత్యంగా ఉంటూ తండా అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. వీఆర్ఓ గంగన్న, తండా వాసులు పాల్గొన్నారు.